చిన్న పాపగా ఉండటం ఇష్టం

షార్లట్ జొలొటోవ్, బొమ్మలు: ఎరిక్



చిన్న పాపగా ఉండటం ఇష్టం

షార్లట్ జొలొటోవ్, బొమ్మలు:   ఎరిక్







అనగనగా ఒక చిన్న పాప.

"పెద్దయ్యాక ఏం అవ్వాలని ఉంది?" వాళ్ల అమ్మ అడిగింది.

"ఇప్పుడైతే చిన్న పాప లాగానే ఉండాలని ఉంది," పాప చెప్పింది.

"ఎందుకని?" అమ్మ అడిగింది. "పెద్దగా అయితే బాగుంటుంది కదా. చిన్న పాపగా ఉండాలని నీకు ఎందుకు ఉంది?"



"నేను చిన్న పాపని కాబట్టి," చెప్పింది చిన్న పాప, "అంతే కాకుండా పెద్ద అయినప్పుడు చెయ్యలేని పనులను చిన్న పాపగా ఉన్నప్పుడు చెయ్యవచ్చు."

"పెద్దవాళ్లు చెయ్యలేనివి నువ్వు ఏం చెయ్యగలవు?" అడిగింది అమ్మ.

"గెంతటం," చెప్పింది చిన్న పాప. "సంతోషంగా ఉన్నప్పుడు నేను గెంతుతాను. సంతోషంగా ఉన్నప్పుడు పెద్దవాళ్లు గెంతలేరు."

"అది నిజమే," అంది అమ్మ, "అయితే వాళ్లు తమ సంతోషాన్ని వేరే రకంగా కనబరుస్తారు."

"అలాగా," అంది చిన్న పాప. "నాకు గెంతటం ఇష్టం. అందుకే నాకు చిన్న పాపగా ఉండటం ఇష్టం."







"ఇంకేమిటి?" అడిగింది అమ్మ.

"భోజనాల బల్ల కింద కూర్చుని దానిని నా ఇల్లుగా చేసుకోగలను, తివాచీ మీద ఉన్న గులాబీల చుట్టూ నా వేలితో గీయగలను. పెద్దవాళ్లు బల్ల కింద కూర్చోలేరు."

"అది నిజమే," అంది అమ్మ, "కానీ పెద్దవాళ్లకి బల్ల కింద కూర్చోవాలని ఉండదు."

"నాకు ఉంటుంది," చెప్పింది చిన్న పాప, "అందుకే నాకు చిన్న పాపగా ఉండటం ఇష్టం."

"ఇంకేమిటి?" అడిగింది అమ్మ.





"వేసవిలో కాళ్లకి చెప్పులు లేకుండా తిరగగలను.
పెద్దవాళ్లు అలా తిరగరు."

"అవును," అంది అమ్మ. "సాధారణంగా అలా తిరగరు."

"నాకు చెప్పులు లేకుండా తిరగటం ఇష్టం," చెప్పింది
చిన్న పాప. "చిన్న పాపగా ఉండటం ఇష్టం."

"ఇంకేమిటి?" అడిగింది అమ్మ.

"ఐస్-క్రీం అమ్మే అబ్బాయికి నా పేరు తెలుసు," అంది
చిన్న పాప. "నీ పేరు తెలియదు."

"అవును," అంది అమ్మ.

"అలా తెలియటం నాకు ఇష్టం," చెప్పింది చిన్న పాప.
"చిన్న పాపగా ఉండటం నాకు ఇష్టం."



"ఇంకా ఏమిటి?" అడిగింది అమ్మ.

"నేను ఏమీ చెయ్యకుండా కూర్చోగలను," చెప్పింది చిన్న పాప. "పెద్దవాళ్లు ఏమీ చెయ్యకుండా కూర్చోలేరు."

"వాళ్లకి చాలా పనులు ఉంటాయి," అంది అమ్మ.

"కూర్చుని ఏమీ చెయ్యకుండా ఉండటం నాకు ఇష్టం," చెప్పింది చిన్న పాప. "చిన్న పాపగా ఉండటం నాకు ఇష్టం."



"ఇంకా ఏమిటి?" అడిగింది అమ్మ.

"ఏదైనా అందమైనది చూసినప్పుడు, క్రేయాన్లతో దాని బొమ్మ వేస్తాను. పెద్దవాళ్లు క్రేయాన్లతో బొమ్మలు వెయ్యరు," చెప్పింది చిన్న పాప.

"సాధారణంగా వెయ్యరు," అంది అమ్మ.

"క్రేయాన్లతో బొమ్మలు వెయ్యటం నాకు ఇష్టం," చెప్పింది చిన్న పాప. "అందుకే చిన్న పాపగా ఉండటం నాకు ఇష్టం."









"ఇంకా ఏమిటి?" అడిగింది అమ్మ.

"పెద్దవాళ్లు కొవ్వొత్తులు, కేక్, ఇస్ క్రీంలతో పుట్టిన రోజు పండగ చేసుకోరు," చెప్పింది చిన్న పాప.

"అవును," అంది అమ్మ, "వాళ్లకి అలా చేసుకోవాలని ఉండదు."

"నాకు ఉంటుంది," చెప్పింది చిన్న పాప, "అందుకే చిన్న పాపగా ఉండటం నాకు ఇష్టం."



"ఇంకా ఏమిటి?" అడిగింది అమ్మ.

"కిటికీలో కూర్చుని అద్దాల వెంట కారే వాన నీటిని చూస్తూ ఉంటాను," చెప్పింది చిన్న పాప. "పెద్దవాళ్లు అలా చెయ్యటం నేను ఎప్పుడూ చూడలేదు."

"అది సరదాగా ఉంటుందా?" అడిగింది అమ్మ.

"నాకు ఉంటుంది," సంతోషంగా చెప్పింది చిన్న పాప. "అందుకే చిన్న పాపగా ఉండటం నాకు ఇష్టం."







"ఇంకా ఏమిటి?" అడిగింది అమ్మ.

"హాలోవీన్ రోజున వింత వింత బట్టలు వేసుకోగలను," చెప్పింది చిన్న పాప, "సరదాగా గడపగలను. పెద్దవాళ్లు అలా చెయ్యరు."

"నిజమే," నవ్వుతూ అంది అమ్మ.

"వింత బట్టలు వేసుకుని సరదాగా గడపటం నాకు ఇష్టం," చెప్పింది చిన్న పాప. "చిన్న పాపగా ఉండటం నాకు ఇష్టం."

"ఇంకా ఏమిటి?" అడిగింది అమ్మ.



"ప్రతి సంవత్సరం ఆకులు రాలినప్పుడు నేను వాటి మీద ఎగిరి దూకుతాను," చెప్పింది చిన్న పాప. "పెద్దవాళ్లు వాటిని పోగుచేస్తారు."

"కుప్పలుగా పోగు చేస్తారు," అంది అమ్మ.

"ఆకుల మీద దూకటం నాకు ఇష్టం," చెప్పింది చిన్న పాప.

"చిన్న పాపగా ఉండటం నాకు ఇష్టం."

"ఇంకా ఏమిటి?" అడిగింది అమ్మ.







"మొట్టమొదటసారి మంచు పడినప్పుడు దానిని నేను తింటాను," చెప్పింది చిన్న పాప. "పెద్దవాళ్లు ఎప్పుడూ అలా చెయ్యరు."

"అది బాగుంటుందా?'' అడిగింది అమ్మ.

"చాలా బాగుంటుంది," చెప్పింది చిన్న పాప. "చిన్న పాపగా ఉండటం నాకు ఎంతో ఇష్టం. జరుగుతున్న ప్రతిదీ నాకు ఇష్టంగా ఉంటుంది."

"సరే," అంది అమ్మ, "పెద్దగా అయ్యి, ఇవన్నీ మళ్లీ జరిగే సంగతి నాకు తెలుసు."

"ఏమిటది?" అడిగింది చిన్న పాప, "అది ఏమై ఉంటుంది?"

పాప చుబుకం పట్టుకుని ఆమె కళ్లల్లోకి చూసింది అమ్మ.







"నువ్వు పెద్దగా అయినప్పుడు నీ లాంటి చిన్న పాపకి అమ్మవి కావచ్చు," అంది అమ్మ.

చిన్న పాప నవ్వింది.

"అంత మంచిది మరొకటి నాకు తెలుసు," చెప్పింది చిన్న పాప.

"ఏమిటది?" అడిగింది అమ్మ. "నీ లాంటి చిన్న పాప ఉండటం అంత బాగుండే విషయం ఏమిటి?"

"రాత్రి నువ్వు నాకు దుప్పటి కప్పి, ముద్దు పెట్టి వెళ్లిన తరవాత నేను మంచంలో పడుకుని నీ లాగా పెద్దగా అవ్వటం గురించి ఊహించుకుంటాను," చెప్పింది చిన్న పాప.

"నువ్వు చిన్నగా ఉన్నప్పుడు పెద్దగా అవుతావని తెలుసు.

"కానీ పెద్దవాళ్లు పెద్దగా అయిపోయారు.

"ఒక రోజు పెద్ద దానిని అవుతానని తెలియటం నాకు ఇష్టం. కానీ ఇప్పుడు మాత్రం చిన్న పాపగా ఉండటమే నాకు ఇష్టం."



అయిపోయింది